కథా నిలయం
శ్రీకాకుళం

# 15. గొంతు దాటని కేక

ఇంటి బయట ఆవరణలో, వేపచెట్టుకింద నవారు మంచం మీద పడుకుని ఆకాశం కేసి చూస్తున్నాడు సురేశ్. చుక్కలు పొడిచినై. మసకవెన్నెల. ఆలోచన తెగటం లేదు.

కొద్దిసేపటితర్వాత 'వచ్చి అన్నం తిను' అని కేకేసింది సునీత. లేచి వెళ్ళాడు. ఆమె వడ్డించింది. తింటున్నాడు. యాంత్రికంగా వుంది జరుగుతున్న పని.

నిశ్శబ్దం ప్రవహిస్తూనే వుంది. మనస్సుల్లోని ఆందోళన బుద్ధిని రగిలిస్తోంది. జరుగుతున్న ఘటనల విసుర్లూ, విదిలింపులూ వెన్నును వణికిస్తున్నె. ఇద్దరి పరిస్థితీ ఒకటిగానే ఉంది.

కంచంలో మజ్జిగ పోస్తూ అన్నది సునీత, "ఈ కాపరం నా వల్ల కాదు, ఏం చేస్తారో మీ యిష్టం" భార్యగా కట్టె విరిచి పొయ్యిలో పెట్టింది. ఏదో వివరణా, మరేదో సంజాయిషీ ప్రయత్నించాడు సురేశ్. ఆమె కళ్ళు అగ్గిపుల్లలయినై. "కుంటిసాకులూ, గుడ్డి అసమర్థతలూ నా ముందు కుప్పపోసి తమరు కాలు ఝాడించకండి" కసురుకుంది. ఆ వెంటనే "ఈ దౌర్భాగ్యం అనేకసార్లు నా కొక్కటే దారిని చూపుతోంది. ఏ ఏట్లోనో దూకటం. కానీ, కన్న కడుపుకదా. ఆ పిచ్చి వెధవ మొహాన్ని చూసి ధైర్యం చేయలేకపోతున్నాను". నెత్తిమీద నీళ్ల కుండ పగిలింది. ఆమె కళ్లు యిప్పుడు వర్షామేఘాలైనాయి.

సురేశ్ మనసు వికలమైంది. కంచంలో చెయ్యి కడిగేసుకుని, పక్కగా గోడకు చేరబడి కూచున్నాడు. ఆ 'పిచ్చివెధవ' కేసి చూశాడు. కొడుకు!

వాడు అరవింద్. ఫ్లోరోసిస్ రోగబాధితుడు. సునీతకి ఈ గ్రామానికి బదిలీ అయినప్పట్నుంచీ, తెలిసి కొంతా, తెలియక కొంతా ఆ వ్యాధి వాడిమీద దాడి చేసింది. బంగారం లాంటి పిల్లాడినీ 'ఆక్టోపస్'లా పట్టుకుంది. ముందుగా గుర్తించలేకపోయారు. తీరా తెలుసుకునేసరికీ అప్పటికే నోట్లో పళ్ళమీ పసుపుగీరతో,

ఎనామిల్ పాడైపోవడం ప్రారంభమైంది. ఉమ్మి ఊరటం ఎక్కువగా ఉండేది. వైద్యానికి పరిగెత్తారు. ఆ మందూ, ఈ మందూ ఇచ్చారు. చూస్తూ చూస్తుండగానే కీళ్ళనొప్పులు మొదలైనై. 'లిగమెంట్స్' దెబ్బతింటునై అని ఏదో వైద్యం చేశారు. ఎముక దృఢత్వం, పటుత్వం తగ్గటం మొదలైనై. కండరాలనొప్పి, ఎముకల నొప్పులూ, నడకతీరు మారసాగింది. మనిషి వెన్నెముకలోనూ మార్పు కనిపించింది. వంగి నడవటం మొదలైంది. కాళ్ళూ వంకరపోసాగినై. వీటి ప్రభావం పిల్లవాడి ఎదుగుదల మీద కనిపించసాగింది. అంతా నాలుగేళ్ళ కాలంలో - అరవింద్ బొన్సాయ్ మొక్కలా కుంచించుకు పోయాడు.

పన్నెండేళ్ళ అరవింద్ ఆరేళ్ల పిల్లవాడిలా వుంటాడు. దొడ్డికాళ్ళ వాడిలా నడుస్తాడు. అతికష్టం మీద ఏదన్నా ఊతంతో నిలబడతాడు. చేతులకి మణికట్టు దగ్గర పట్టులేదు. వేళ్ళు లోపలికి ముడవాలంటే ప్రాణం గిలగిల్లాడుతుంది. అన్ని పనులూ ఇతరులు చేయించాల్సిందే.

సునీత అవస్థే ఇది. తన పనులూ, కొడుకు పనులూ పూర్తి చేసుకుని పదింటికల్లా ఆఫీసుకు పోవాలి. తానులేని సమయంలో వాణ్ణి బయట వరండాలో కూర్చోబెట్టి వెడుతుంది. పుస్తకాలూ, ఏవో కొన్ని ఆటవస్తువులూ ఇచ్చి పోతుంది. పక్క పోర్షన్ వనజమ్మ సునీత తిరిగి వచ్చేలోగా వాడి అవసరాలకి సహాయ పడుతూ వుంటుంది. 'మనిషికి మనిషి సాయం లేకపోతే ఎట్టా?' అనే మంచి మనసు ఆమెది. నిజానికి వనజమ్మ భర్త కూడా ఆ వ్యాధిన బడి మంచంలో తీసుకుంటున్న రోగే. అసలా గ్రామంలో ఎక్కువమందికి సోకిందీ వ్యాధి. నాయకుల వాగ్దానాలూ, అధికారుల యాత్రలూ - ఏ మంచినీ జరపలేదు. ప్రణాళికలూ, పథకాలూ 'నీటి' మీది రాతలే అయినై. అసలా వ్యాధే - నీటిద్వారా సంక్రమించేవ్యాధి.

అరవింద్ బాధని చూసేకొద్దీ సునీత వ్యథ ఇంకా ఇంకా ఎక్కువైపోతోంది. అటు ఉద్యోగం, ఇటు అరవింద్. ఈ రెంటితో ప్రత్యక్ష నరకాన్నే అనుభవిస్తోందామె. అందుకనే ఆమె మాటతీరు అంత కటువుగా మారింది.

మెల్లగా బెరుకు బెరుగ్గా తలెత్తి భార్యవైపు చూశాడు సురేశ్. దుఃఖంతో ఆమె ఉద్వేగంగా వుంది. ముకుపుటాలు అదురుతున్నై. పెదవులు వణుకుతున్నై.

అసలు సాయంత్రం నేను వచ్చినప్పట్నుంచీ వాతావరణం బాగాలేదు అనిపించింది సురేశ్‌కి. వారాంతమని మామూలుగానే ఇంటికొచ్చాడు. తనను చూసి సునీత మొహమేమీ చేటంత కాలేదు. ముడుచుకుపోయింది. ఉదాసీనంగా తన పని తాను చేసుకోసాగింది. అరవింద్ మాత్రం 'నాన్నొచ్చాడు' అన్నాడు. తనకు తాను చెప్పుకున్నాడో, తల్లికి చెప్పాడో తెలీదు. రవ్వంత సంబరం కనిపించింది వాడి మొహంలో. అదే తన మనసుకి అణువంత ఊరట!

సునీత కూడా అన్నం తినటం అయిందనిపించింది. వస్తువులూ, పదార్థాలూ సర్దేసి కూచోబోయింది. అంతలోనే ఆగి, అరవింద్ వున్న చోటికి నడిచి, వాడిని రెండు చేతుల్తోనూ ఎత్తుకుని, తీసికెళ్ళి ముందుగదిలో వాడి మంచం మీద పడుకోబెట్టింది. బొంతనీ, దుప్పటినీ సర్ది వెనక్కి వచ్చింది. తలుపు రెక్క కానుకుని కూచుంది.

ఆమె దగ్గరసా వెళ్ళి పక్కగా కూచున్నాడు సురేశ్. విషాదాన్ని ఆఘ్రాణించినట్లయింది. అనునయంగా ఆమె బుజాన చేయి వేశాడు. "నా అసహాయతని అర్థం చేసుకో సునీతా. నేను నీ ట్రాన్స్‌ఫర్ కోసం చెయ్యని ప్రయత్నం వుందా? ఆలోచించు" అన్నాడు మాటలు బిగబట్టి వదులుతూ.

'ఏమో నాకేం తెలీదు"

"నీకు తెలుసు. అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకుంటున్నాను. అయినా పని కావటం లేదు."

"అయితే ఉద్యోగం మానేస్తాను"

"మన పరిస్థితి తెలిసీ - గవర్నమెంట్ ఉద్యోగాన్ని మానేస్తాననటం...." నసిగాడు. నీళ్ళు నమిలాడు.

ఆమె గయ్యిమంది. "ఉద్యోగం మానేయకూడదు. మీ అమ్మా చెల్లెళ్ళూ వీధిన బడతారు. మీకు ప్రైవేట్ ఉద్యోగం తప్ప రాదు. అందుకని నేనూ, నా పిల్లాడూ ఇలా చావాలి"

నేల చూపుల్లో పడ్డాడు సురేశ్. అంతలోనే మళ్ళీ ఏడుపు పొంగుకొచ్చింది సునీతకి. "అయితే వీణ్ణి మీరు తీసుకుపోయి వుంచుకోండి. అమ్మ దగ్గరే పెడతారో, మీ దగ్గరే పెట్టుకుంటారో మీ యిష్టం" విసురుగా అన్నది.

సురేశ్ మౌనం వహించాడు. అతనికి తెలుసు. ఇట్లాంటి మాటలు ఏళ్ళ తరబడి సాగుతూనే వున్నై కాని మాటలు. ఆక్రోశంతో, ఆవేదనతో ఆమె అలా మాట్లాడడం మామూలే. హోరుగాలి చెవుల్ని చీల్చేస్తున్నట్టే మాటల్ని వీస్తుంది. ఆమె మనసు కూడా కొడుకు బాధతో బండబారి పోయిందేమో అనిపిస్తూ వుంటుందతనికి అప్పుడప్పుడు. ఆమె పట్ల జాలీ, సానుభూతీ కలుగుతాయి. పాతజ్ఞాపకాలూ, ఈనాటి స్థితిగతులూ మనసున ముసురుతాయి.

తనదీ సునీతదీ ప్రేమ వివాహం. సునీత తల్లిదండ్రులకి తమ పెళ్ళి ఇష్టం లేదు. చాలా రచ్చ చేశారు. చివరికి కూతురి పట్టుదలతో విసిగి, వేసారిపోయి, బంధాలూ, బంధుత్వాలూ తెంచేసుకున్నారు. తనతల్లీ, చెల్లెళ్ళూ మాత్రం లోపలి భావాల్ని అణగదొక్కుకుని సునీతని అంగీకరించారు. బహుశ, ఆర్థికంగా తాము కొడుకూ కోడలిమీద ఆధారపడక తప్పని పరిస్థితి వల్లనేమో! కానీ, నోటితో పిలిచి, నొసటితో వెక్కిరించే స్వభావాలూ, ప్రవర్తనలూ మాత్రం బయటపడుతూనే వుంటై. వాళ్ళు ముగ్గురూ కర్నూలులో వుంటారు. చెల్లెళ్ళిద్దరూ పెళ్ళీడుకొచ్చారు. ఆ బాధ్యత తమది. సునీత ఉద్యోగం, ఈ పాటి ఆదాయం లేకుండా ఆ బాధ్యతని నెరవేర్చే అవకాశమేలేదు. అదీ సమస్య.

సురేశ్ తన ఆలోచనల్లో తానుండగానే సునీత లేచివెళ్ళి ఆవరణలోని నవారు మంచాన్ని తెచ్చి, మధ్య గదిలో వేసింది. దుప్పటీ దిండూ పడేసింది. మంచం పక్కగా నేలమీద చాపపరుచుకుని, దిండు పెట్టుకుంది. తిరిగివచ్చి, ఇందాక తాను కూచున్న చోటనే కూలబడింది.

"ఏం చేస్తావో ఏమో ఆలోచించు" అంది ఎటో చూస్తూ. సురేశ్‌ని ఆమె ఒక్కొక్కప్పుడు ఏకవచనంతోనూ, ఒకొక్కప్పుడు గౌరవ వాచకంతోనూ సంబోధిస్తూ వుంటుంది. మళ్ళీ ఆలోచన లేచింది సురేశ్ మేథలో. అరవింద్‌ని కర్నూల్‌లో వుంచే ప్రసక్తే లేదు. తల్లివాణ్ణి చూడలేదు. తన చెల్లెళ్ళిద్దరూ ఏదో ఫ్యాక్టరీలో డైలీవేజ్ మీద పని చేస్తూ వుంటారు. అట్టాగని అరవింద్‌ని తనతో ఎక్కడికి తీసుకువెళ్ళగలడు. తీసుకుపోయినా, ఏం చేయగలడు? హైదరాబాద్ మహానగరంలో తనది తుమ్మితే ఊడేముక్కులాంటి ఉద్యోగం. ఉండేది హాస్టల్‌లో. సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కౌన్సిలర్ జాబ్ తనది. నెలకి ఆరువేలిచ్చి, పదివేలకి సంతకం తీసుకుంటుంది యాజమాన్యం. 'ఇన్‌కమ్‌టాక్స్ ప్రాబ్లెమ్స్‌లెండి'

అంటారు! శిక్షణ కోసం వచ్చే అభ్యర్థుల సంఖ్య తగ్గిందంటే, తన ఉద్యోగానికి కాళ్ళొచ్చి నట్టే; చేతికి వైట్ కవర్ వచ్చినట్టే!

సురేశ్ మనసులో సుడితిరుగుతున్న ఆలోచనల్ని తెలుసుకోలేనిదేం కాదు సునీత కూడా. ఆమెకీ ఈ వాస్తవాలు బాగానే తెలుసు. తెలిసీ, అరవింద్ బాధతో, నిస్సహాయతతో ఆమె దుఃఖాన్నీ, ఆక్రోశాన్నీ, ఆవేదననీ మింగుకోలేకపోతోంది.

లేచి వంటింట్లో లైట్ తీసివచ్చి తన చాపమీద నడుం వాల్చింది సునీత. ఆమె వెనగ్గా తానూ లేచివచ్చి తన మంచం మీద కూచున్నాడు సురేశ్. కిటికీలోంచీ బయటి వెలుగు ఆమె మొహం మీదపడుతోంది. ఆ చారలో ఆమె పచ్చని మొహం – ఒక చెన్ను తరిగినా కాంతివంతంగా కనిపిస్తోంది. "సునీత కనుముక్కు తీరు బాగున్న మగువ" అనుకుంది సురేశ్‌మనస్సు

సునీత పక్కకి తిరిగింది. అన్యమనస్కంగా అంటున్నట్టు చెప్పింది. "మండల ఆఫీసులకీ, ఆఫీసర్ల చుట్టూనూ తిరిగితిరిగి నాకూ విసుగేస్తోంది. ఎవరికి వారు 'ఇక్కడికొచ్చే వాళ్ళని చూప'మని అడిగేవాళ్ళే."

ఆమె మాటలు వింటుంటే కిందటివారం జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది సురేశ్‌కి. కడపవెళ్ళి ప్రాంతీయాధికారిని కలిశాడు. ఆయన చాలా నిష్కర్షగా మాట్లాడాడు. "మీ భార్య ఉద్యోగం చాలా రిమోట్‌ప్లేస్‌లో ఉంది. కదిరి అన్నాకాదు. ఆ ప్లేస్‌కి వెళ్లే ఉద్యోగి దొరకడు. పోనీ మీ అవస్థల్ని గమనించి, హెల్ప్ చేద్దామని ఎవర్ని సూచించినా, సదరు వ్యక్తి, ఎక్కడ స్విచ్‌నొక్కాలో అక్కడ నొక్కి ఆపుకుంటాడు. అంతా రాజకీయం, ఒత్తిళ్ళూ. చూడండి– మీకూ ఎవరన్నా దొరుకుతారేమో" అన్నాడు.

కొంతసేపు తానూ తన ఘోషని మళ్ళీ వినిపించాడు. అంతా చర్విత చర్వణం. కాళ్ళీడ్చుకుంటూ వచ్చేశాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. అరవింద్ పరిస్థితి కళ్ళకు కట్టింది. సునీత అవస్థలూ బాధించినై. ఆమె తనని అసమర్ధుడుగా భావిస్తున్నట్టున్నదనే చింత సలుపసాగింది. పోయిన తండ్రి గుర్తొచ్చాడు. తల్లి గుర్తుకొచ్చింది. చెల్లెళ్ళూ కళ్ళముందు మెదిలారు.

లేచి వెళ్ళి భార్యపక్కన, ఆమె నడుం దగ్గర కూచున్నాడు. "కడపలో జరిగిందంతా ఫోన్‌లోనే చెప్పానుగా" అన్నాడు. కంఠస్వరంలో అపరాధభావమూ, అసహాయభావమూ తొణికిసలాడినై.

ఆమె చప్పున అతను కూచున్నవైపు తిరిగి, కళ్ళెత్తి చురుగ్గా చూసిందతన్ని. సురేశ్‌కి ఆమె చూపుకంటే, ఆమె స్పర్శా, వొత్తిడీ ఉద్వేగ భావనల్ని కలిగించినై.

మనసు ఆర్ద్రమైంది. 'సు...నీ...తా' అని మరి కొంత జరిగాడు. వంగాడు. ఒమె ఊపిరి వెచ్చగా తాకింది.

గడుస్తున్న క్షణాలు గడవని సంసార విషాదంలోకి జారుతున్నై. ఉస్సురని నిట్టూరుస్తూ, భర్త చేతిని తన చేతితో మృదువుగా నొక్కింది సునీత.

అలసటతో గడుస్తోంది రాత్రి.

❖ ❖ ❖

నెల గడిచింది. సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్రటరీని కలిశాడు సురేశ్. తమ బాధని చెప్పుకున్నాడు. అరవింద్ దురవస్థనీ దీనంగా నివేదించుకున్నాడు. ఆయన ఫ్లోరోసిస్ గురించీ, ఆ గ్రామాల గురించీ, అక్కడి త్రాగునీటి సమస్య గురించీ, ప్రభుత్వం చేయాలనుకుంటున్న (!) సదుపాయాల్ని గురించీ – సురేశ్‌కి చాలా విషయాలు చెప్పి, అతన్ని మూగశ్రోతని చేశాడు. చివరికి, "అది కాదు మాష్టారూ, మీరు మీ ఎమ్మెల్యేనో, ఎంపీనో పట్టుకోండి సార్" అని ఉచిత సలహా ఇచ్చాడు. శుష్కప్రియాలతో, శూన్య హస్తాలతో బయటకి పంపించాడు. 'మంచి మాటకారి' అనిపించి ఏడుపొచ్చింది సురేశ్‌కి.

బయటికొచ్చి సునీతకి ఫోన్ చేసి చెప్పాడు.

ఆమె ఫోన్‌లోనే కళ్ళనీళ్లు పెట్టుకుంది. జీవంలేని పలుకులతో తన గుండెల్లోని దుఃఖాన్ని వొంపుకుంది.

సురేశ్ కెందుకనో మొదటిసారి గుండెలు జారినట్లూ, భయంతో వెన్ను జలదరించినట్లూ అనిపించింది. అప్రయత్నంగా అతనికీ కళ్ళనీళ్ళు తిరిగాయి.

ఆ వారంలోనే – ఒకరోజు,

ఉన్నట్టుండి పిడుగులాంటి కబురు చెప్పింది సునీత. "అరవింద్ కుడిమోకాలు దగ్గర ఫ్రాక్చర్ అయింది. కదిరిలో... హాస్పటల్‌లో చేర్పించాను. వెంటనే రండి" అని ఫోన్ స్విచాఫ్ చేసింది.

సురేశ్‌కి గుండె దడదడలాడింది. పడుతూ లేస్తూ, బస్‌లు మారుతూ వెళ్ళాడు.

హాస్పటల్‌లో వున్నాడు అరవింద్. మన స్పృహలో లేడు. "కాలికి ప్లాస్టర్ వేసి సెడెటివ్ ఇచ్చారు" చెప్పింది సునీత. పళ్ళ బిగువున ఏడుపుని ఆపుకుంటోందామె. సురేశ్‌కి బాధ కలిగింది.

సురేశ్ వెళ్ళి డాక్టర్‌తో మాట్లాడాడు. "లిగమెంట్స్‌లో కేల్సిఫికేషన్ ఎక్కువగా వుంది. ఎముకలు బాగా పెళుసుగా వున్నై. ఆపరేషన్ చెయ్యాలన్నా రిస్కీ. బోన్ సెట్ చేసి ప్లాస్టర్ వేశాం. అదృష్టం బాగుంటే అతుక్కుంటుంది" అని తనపనిలోకి తాను వెళ్ళాడు డాక్టర్.

మూగగా ఒకర్నొకరు చూసుకుంటూ బెంచ్‌మీద కూచున్నారు భార్యాభర్తలు. పక్క బెడ్ దగ్గర ఎవరో వో పెద్దాయన మాట కలిపాడు. పరిచయం తర్వాత సలహా ఇచ్చాడు. "హైదరాబాద్ తీసుకుపోయి ఏ నిమ్స్‌లోనన్నా ట్రీట్‌మెంట్ ఇప్పించండి. లేకపోతే కనీసం కర్నూలు హాస్పటల్‌లో చేర్చండి."

ఆయన పక్కకి పోయిన తర్వాత సునీత తనలో తాను అనుకుంటున్నట్టు భర్తతో అన్నది,"ఏం చేయాలన్నా డబ్బు సమస్యే. నాకున్న సోర్సెస్ అన్నీ అయిపోయినై. జీతంలో మూడొంతులు ఇప్పుడున్న లోన్స్‌కే కట్ అవుతోంది. అయినా, ఈ రోగంతో కర్నూల్లో జాయిన్ చేసినా, ప్రత్యేకం కలిగే మేలేం లేదన్నాడు డాక్టరు. ఆయన చాలా సౌమ్యుడు. వివరంగా, ఓపిగ్గా సలహా ఇచ్చాడు."

ఇద్దరికీ మనసులు భారంగా వున్నై. నిశ్శబ్దంగా ఎవరి ఆలోచనల్తో వారు కన్నీరు పెట్టుకుంటూ కూచున్నారు.

-నాలుగు రోజుల తర్వాత అరవింద్‌ని హాస్పటల్ నుంచీ డిశ్చార్జ్ చేశారు. ఇంటికొచ్చి పడ్డారు ముగ్గురూ.

మందులు వాడుతున్నారు. భార్యా భర్తల్లో ఎవరో ఒకరు దగ్గరుండి చూడాల్సిన పరిస్థితి.

సురేశ్ సెలవయిపోయింది. తప్పనిసరిగా హైదరాబాద్‌కి తిరిగివెళ్ళి పోయాడు. తానెటూ జీతం లేని సెలవులో వుంది సునీత.

యాంత్రికంగా గడుస్తున్నై రోజులు. రోజూ ఫోన్ చేస్తున్నాడు సురేశ్. ఫోన్‌లోనే తన బాధనీ, అవస్థనీ వెళ్ళబోసుకుంటోంది సునీత. నిష్టూరాలూ సాగిపోతున్నై.

ఒక ఆదివారం నాడు – కర్నూలునుంచీ సురేశ్ తల్లీ, చెల్లెళ్ళూ ఉదయం వచ్చి అరవింద్‌ని చూసి రాత్రికి వెళ్ళిపోయారు. మాట వరసకన్నా – మనిషి సాయంగా తానుంటానని అత్తమ్మా అనలేదు; కోడలూ కోరలేదు!

– బుధవారం పగలు, సురేశ్ ఆఫీసులో చాలా పని ఒత్తిడిలో వుండగా ఫోన్ చేసింది సునీత. “అరవింద్ పరిస్థితేం బాగాలేదు. నాకెందుకో భయంగా వుంది. వెంటనే రండి” అని.

ఆ రాత్రికి బయల్దేరి మర్నాడు ఉదయానికి ఇల్లు చేరాడు.

అరవింద్‌కి కీళ్ళనొప్పులూ, కండరాల నొప్పులూ ఎక్కువైనై. ఫ్రాక్చరైన చోట సలుపూ,మంటా, నొప్పీ, పగలూ, రాత్రీ బాధ. మూలుగూ, ఏడుపూ, అన్నం సహించటం లేదు. బలవంతాన ద్రవాహారం ఇస్తున్నారు. పిల్లవాడు క్రమేపీ నీరసించిపోతున్నాడు. మళ్ళీ అడ్మిట్ చేయమంటారా అంటే, అక్కర్లేదని మందులు చెప్పాడు హాస్పటల్ డాక్టరు. వాటిని వాడుతున్నారు.

శుక్రవారం రాత్రి – పన్నెండు గంటలు కాబోతోంది. అరవింద్‌కి తీవ్రమైన కడుపునొప్పి మొదలైంది. ఆగకుండా వాంతులు. సురేశ్ సునీతా తత్తరబిత్తరలాడారు. ఇరుగుపొరుగువాళ్ళు చేరారు. ‘ఇవన్నీ ఆ వ్యాధి లక్షణాలే. ఫలానా మనిషి ఇట్టాగే పోయాడు ఆ మధ్య’ వంటి గుసగుసలు వినిపించినై. సురేశ్ వెళ్ళి లోకల్ డాక్టర్‌ని పిలుచుకొచ్చాడు. ఆయన చూసి, కర్నూలు తీసుకుపొమ్మని సలహా ఇచ్చాడు.

పరిచయస్థులెవరో డబ్బు సేకరించి పెట్టారు. టాక్సీ మాట్లాడుకొచ్చారు. అప్పటికే అరవింద్ డీలా పడిపోయాడు. తల వాల్చేశాడు. వాడి ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది.

సురేశ్ , సునీతా మొదలునరికిన చెట్లలా కూలిపోయారు.

మర్నాడు – పేపర్లలో అరవింద్ మరణవార్త వచ్చింది. ఫ్లోరోసిస్ వ్యాధిపట్ల ప్రభుత్వ అలసత్వం గురించి నిరసన తెలుపుతూ రాశారు. ‘ఈ పాపం , నేరం ఎవరిది?’ అంటూ కథనాలూ వచ్చినై.

రోజులు గడుస్తున్నై.

జీవచ్ఛవాల్లా తిరుగుతున్నారు సురేశ్, సునీతా. సురేశ్ ఉద్యోగం పోయింది. వేరే ప్రయత్నాలు మొదలెట్టాడు. సునీత ట్రాన్స్‌ఫర్ కోసం ఇద్దరూ కలిసి వెళ్ళి

ప్రాంతీయాధికారిని కలిశారు. 'మీ మెయిన్ ప్రాబ్లెమ్ సాల్వ్ అయింది కదా' అని వెకిలి నవ్వు నవ్వాడాయన. దంపతులకి కడుపు తరుక్కుపోయింది. గుప్పిడి బిగిసింది. ఆక్రోశం పొంగింది. మాట బయటకి రాలేదు.

రెణ్ణెళ్ళు గడిచినై. సురేశ్ హైదరాబాద్‌లోనే ఏదో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో చేరాడు. ఒక వారాంతంలో నాలుగు రోజులు సెలవులు కలిసొస్తే ఇంటికొచ్చాడు.

ఆరాత్రి – సునీతని పరీక్షగా చూశాడు సురేశ్. ఆమెలో ఏ కళా కాంతీ లేవు. పదేళ్ళ అదనపు వయసుమీద పడిన దానిలా కనిపిస్తోంది. మనిషి చిక్కిపోయి, నీరసించి పోయింది. పాతచీరతో, జడవేసుకోకుండా, భారంగా కాళ్ళీడుస్తూ నడుస్తోంది. ఆరోగ్యం గురించి వివరాలడిగాడు. "అప్పుడప్పుడూ జ్వరం. ఒళ్ళంతా విరగ్గొట్టినట్టు నొప్పి, వెన్నూ, కీళ్ళు నొప్పులు. కాళ్ళూ చేతులూ వేళ్ళ వాపూ, నొప్పి. ముడవటానికి రావటం లేదు"

ఆందోళన పడ్డాడు సురేశ్. డాక్టర్‌ని కలిశారు. "ఆస్టియో పోరోసిస్ అంటారమ్మా. అది సెటిన్ అయింది. ఇదంతా మీ వూరి నీళ్ళ ప్రభావమే" అని "మీరావూరు వదలటం మంచిది" అని సలహా యిచ్చాడు. మనసు వికలమైంది. ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. పక్కకి చూస్తే టీవీలో ఫ్లోరిన్ నీటి ప్రభావం గురించిన స్టోరీ వస్తోంది! ఇద్దరి కళ్ళల్లోనూ ఒకేసారి నీరు ఉబికింది! గుండె గొంతుకలో కొండంత కేక కొట్టాడుతోంది!

**(స్వాతి మాసపత్రిక, జనవరి 2013)**